# భవిష్యత్తుకు ప్రాణం

కొన్ని కొన్ని విషయాలు కాగితాలపై ఉన్నప్పుడు దారుణంగా కనిపిస్తాయి. కాని అల్లాంటివి నిత్య జీవితంలో ఎంతో సాధారణంగా ఏ మాత్రం పట్టింపు లేకుండానే జరిగిపోతూ ఉంటాయి. అవి ఆయా పరిస్థితుల ప్రభావం మీద ఆధారపడి, ఆయా మనుషుల అలవాట్ల ప్రాబల్యంతో బలిసిపోతాయి. అంతా మామూలుగానే జరిగిపోతుంది. అందులో బాధపడవలసిన విషయంగాని, ఏమిటిలా జరుగుతోంది అని విచారించవలసిన విషయంగాని వారికేమీ ఉండదు. అంతే...

కాని ఈ బూడిదలోనికి, ఈ దుమ్మూ దూగరలోనికి, ఈ విషవాయు ప్రాంగణంలోనికి పరాయి వారెవరో ఎప్పుడో ఎందుకో అకస్మాత్తుగా ప్రవేశిస్తారు. అప్పటికికాని వాళ్లకు తమ స్థితి తెలిసిరాదు. తమలోని నైచ్యం అప్పుడుకాని వాళ్ళ కళ్ళబడదు!

ఇసుకలో కూరుకుపోతూన్న జోళ్ళని బరువుగా లాగుకుంటూ అనుకోని మార్గం గుండా ఇంటికి వెళ్తున్నాను. అంతా చీకటిగా ఉంది. చీకటి ఆకాశపు కంటిపాపలా ఉంది. ఆ నల్లని కనుపాపను ఇలా నడుస్తూ పొడుస్తున్నానా అనిపించింది. నా ఒళ్లు జలదరించింది. నన్ను భయం ఆవహించింది.

అవన్నీ పూరిగుడిసెలు, కొన్నింటిలో దీపాలు లేవు. కొన్నింటిలో బిక్కుబిక్కు మంటున్నాయి. మార్గం సరిగా కనిపించడం లేదు. సరిగా ఏమిటి అసలు కనిపించడమే లేదు.

ఆ చీకటిలో కాళ్ళు మెల్లగా నడకసాగిస్తున్నాయి. కొత్త వాడివిలా ఉన్నావ్... ఇటెందుకొచ్చావ్... అన్నట్టుగా ఓ కుక్క మొరిగింది. ఎవడో తాగి పిచ్చి పాటలు పాడుకుంటున్నాడు. ఆ మూల ఇద్దరు ముగ్గురు ఒకరి మీద ఒకరు బూతుల వర్షం కురిపించుకుంటున్నారు. మార్గమంతా దుర్వాసన కొడుతోంది. ఇంతలో ఏమిటో

బుడ బుడమంది. ఎవరో కుండలోంచి నీళ్లు తీసుకుంటున్నా రనుకున్నాను. కాని వెంటనే గాజుల గల గల, నీళ్ల జలజల ఒకటి తరువాత ఒకటిగా, ఒకటిలో ఒకటి కలిసిపోయి వినిపించాయి. నా గుండెలాగిపోయాయి. మరుగులేని ఇల్లాలు, చీకటే మరుగుగా, బాట పక్క స్నానం చేస్తోంది. ఏదో స్వరూపం నల్లగా నా కళ్ల ముందు నిలబడింది. ఎవరో నా వెనుక వికృతంగా నవ్వుతున్నారు!

ఇంటికి ఎలా వచ్చానో తెలియదు. భోజనం చేయబుద్ధికాలేదు. ఏవేవో ఆలోచనలు.

దేశం, దాని అభివృద్ధి, ఆర్థిక సమస్యలు, ప్రజాభ్యుదయ ప్రణాళికలు, ఎన్నో ఎన్నో సమస్యలు అన్నీ నా మెదడులో తిరుగుతున్నాయి. తిరిగి, తిరిగి కాళ్లు పీకి ఓ మూల నిస్ప్రాణగా కూలబడి పోతున్నాయి.

చికాగ్గా కుర్చీలో కూలబడ్డాను. కుర్చీలోంచి లేచాను. గదిలో అటు ఇటు తిరిగాను. మనసుకు పిచ్చెత్తినట్లయింది. దొడ్లోకి మంచం తీసుకొనిపోయి చల్లని గాలిలో మేనువాల్చాను. మంచంమీద మేను వాలింది. కాని మనసులో ఎవరో కూర్చునే ఉన్నారు. కమల వచ్చింది. 'అప్పుడే నిద్రపోయారా...' అంది 'అబ్బే నిద్రపోలేదు, కూర్చునే ఉన్నాను' అన్నాను. నా పొరపాటు నేనే తెలుసుకునే లోగానే కమల పకపక నవ్వింది. 'ఇవ్వాళ మీకే మయింది' అంది. 'ఇంతకీ ఇల్లు దొరికినట్లేనా...?' అంది.

నేనామెకు జవాబివ్వలేదు. నాలో నేను ఆలోచించుకుంటున్నాను. మధన పడుతున్నాను.

అప్పుడే కమల ఏదో రహస్యం చెప్పబోతూన్నట్లు నాకు దగ్గరగా వచ్చి "ఇందాక ఆవిడగారేమందో తెలుసా... ఛీ..." అంది.

నా ఆలోచనలు కొద్దిగా మందగించాయి.

"ఆవిడెవరో చెప్పకుండా ఏమందో తెలుసా అంటావేం..." అన్నా.

కమల విసుక్కుంది. "అబ్బ అంత తెలియనట్లు మాట్లాడుతారేం... రవణమ్మండీ... రవణమ్మ... ఈ ఇంటి ఓనరీమణి" అంది.

నాకు ఫక్కున నవ్వు వచ్చింది. "ఓనరీమణేమిటి నీ మొహం... ఏం... మళ్ళీ ఏమైనా పేచీ పెట్టిందా?"

"పేచీలు పెట్టాలంటే ఆవిడగారికి కొదవేమిటిలెండి... ఇందాక వీధి గదిలో లైటు వెలిగిస్తే ఎందుకమ్మాయీ ఆ లైటు.. అబ్బాయి వచ్చిన తరువాత వెలిగించగూడదూ... అంది. నా ఒళ్లు మండిపోయింది. డబ్బు పుచ్చుకుంటూ మధ్య ఈ సతాయింపు

లేమిటీ... ఛీ... ఛీ... ఇంత నీచపు మనిషినెక్కడా చూడలేదు. "వారు ఇంటి దగ్గర ఉండని మొత్తం కాలానికేమైనా అద్ది తగ్గించేసే ఏర్పాట్లు చేస్తున్నారేమిటి పిన్నిగారూ' .. అన్నా. ఈ మాటతో చచ్చింది. ముఖం ముడుచుకొని, ఏమిటో సణుగుకుంటూ ఇంట్లోకి గబగబా వెళ్ళిపోయింది".

ఈ మాటలతో నా మనసు తిరిగి వెనక్కి వెళ్ళిపోయింది, రవణమ్మ గురించి ఏమిటేమిటో ఆలోచించింది. ఆమె చరిత్ర అంతా స్పష్టాస్పష్టంగా నా కళ్ళ ముందు నిలిచింది. ఈలోగా కమల నా చెవి దగ్గర ఏమిటో గొణిగింది. నాకు అదేమీ వినిపించలేదు. 'ఏమిటీ!' అన్నా.

"అబ్బ... ఎన్నిసార్లు చెప్పాలి. అంత గట్టిగా మాట్లాడుతారేం... వింటుంది. ఎక్కడో బల్లిలా నక్కి ఉంటుంది" అని ఆగిపోయింది.

నాకు కమల మీద భలే కోపం వచ్చింది.

"మరీ అంత తక్కువగా మాట్లాడెయ్యకు" అన్నా, అలా అనడమైతే అన్నానే కాని కమల అన్న మాటల్లో అబద్ధం లేదు.

కమల కాస్సేపు మాట్లాడలేదు. అటూ ఇటూ తల తిప్పి చూసింది. నా కళ్ళల్లో కళ్ళు పెట్టింది.

"ఎంత పొగరుబోతు, ఆడదై మొగుడిచేత కాళ్ళు పట్టించుకుంటుందటండీ దారుణం... మధ్యాహ్నం పోస్టు వుత్తరం యిచ్చేద్దామని వెళ్ళాను. ఏం చెప్పను ఆ ఇంట్లో..." అంటూ ఆగిపోయింది.

ఈ మాట వినగానే నా ముఖంపైకి బాధ భూమిలోంచి తొలుచుకొచ్చే పురుగులా పైకి వచ్చింది. ఈ బాధ పురుషుల మీద ఉన్న అభిమానం వల్ల పుట్టుకొచ్చింది కాదు. స్నేహభావంతో ఇట్లాంటి పనులు జరిగినప్పుడు ఎవరూ ఏమీ బాధపడరు. కాని ఇదంతా బానిస భావంతో జరుగుతూన్నప్పుడు సహించడం ఎంతైనా కష్టం!

రవణమ్మ పేదరికంలోంచి పైకి వచ్చిన మనిషి. భర్త సూరన్న తాలూకా ఆఫీసులో బంట్రోతు పని చేసి రిటైరయ్యాడు. అక్కడ అతను నిజంగా తహసీల్దారు బూట్లుశుభ్రంగా తుడిచి, చక్కగా పాలిష్ చేసేవాడు. తహసీల్దారుగారి పిల్లలు అరుగులు ఖరాబుచేస్తే అవి కడిగి బాగుచేసేవాడు. ఆ ఇంటిలోని వాళ్ళ రోజా విడిచే బట్టలు, తువాళ్ళు,లుంగీలు వగైరా... ఉతికి ఆరవేసేవాడు. ఈ పనులతో అతనిలో బానిసభావం వృద్ధి అయింది. అతని ఈ స్థితి కనిపెట్టిన భార్య, అతన్ని తద్భిన్నంగా చూడలేక పోయింది. పైగా కూతురును ధనవంతుల బిడ్డకిచ్చి తన చాకచక్యంతో

పెళ్ళి చెయ్యడంతో ఆమె హోదా మరింత పెరిగిపోయింది.

సూరన్న, రవణమ్మ తెలివి ముందు ఎందుకూ కొరగానివాడు. ఆ భార్య లేకపోతే తనెందుకూ పనికి రానివాడికింద తలచే బలహీనుడు. కూతురు అండచూసుకొని రవణమ్మ కొడుకును ఎం.ఎ. వరకు చదివించగలిగింది. ఇది ఆమెకెంతో గర్వకారణమైందనే చెప్పాలి.

ఇంటిలో ఏనాడూ తిండికి లోపం లేకుండా చేసి, వీధిలో సాటికులస్థుల ముందు తలెత్తుక తిరిగే సామర్థ్యాన్ని, వాళ్ళ తగువులు తీర్చే నేర్పరి తనాన్ని సాధించగలిగిన రవణమ్మ, భర్తను రాను రాను మరీ తక్కువగా చూడటం అలవాటు చేసుకుంది. 'అబ్బబ్బ... తలనొప్పి చంపేస్తూంది. ఒళ్ళంతా పులపరంగా ఉంది' అంటుంది.అంతే. ఇక ఆ రోజు సూరన్నే వంటచేయాలి. ఇలాంటి వెన్నైనా చెప్పొచ్చు కాని, చీకటినే లేచి, కళ్లాపి జల్లి, అంట్లుతోమి, ఇంటిని శుభ్రంగా ఊడ్చేస్తాడంటే నమ్మడం కష్టమే.

వాళ్ల అబ్బాయి మోహనరావు ఎంత మంచివాడో చెప్పలేం. అతను ఎం.ఏ. ఫస్టుక్లాసులో రావడం, ఈ మధ్యనే ఐ.ఎ.ఎస్.కు సెలక్టు కావడం జరిగింది. తర్ఫీదయిన పిమ్మట నెల్లూరులో సబ్ కలెక్టర్‌గా అతను పనిచేస్తూ ఉన్నాడు. ఒక వారం రోజులు సెలవు మీద రేపు అతనీ ఊరు వస్తున్నాడు.

మరునాడు స్టేషనుకు వెళ్ళి అతన్ని కలుసుకోవాలనుకున్నాను. నాకేమిటో అతన్ని ఇంటికి ఓ కారులో తీసుకురావాలనిపించింది. మా స్నేహితుడొకడు రెవిన్యూ ఇన్‌స్పెక్టరీ చేస్తున్నాడు. వాళ్ళ తహసీల్దారుగారి జీప్ అడిగి, ఏదో మిషమీద తీసుకరమ్మన్నాను. అతను సరే అన్నాడు.

మరునాడు ప్రొద్దున్నే నేను మా స్నేహితుని ఇంటికి వెళ్ళాను. 'జీప్ మాట ఏమయింది' అన్నాను. వెంటనే అతను ముఖం అదోలా పెట్టి "చిన్న పొరపాటైంది బ్రదర్. మా తహసీల్దారు మెయిలుకు వచ్చి, ఆయన్ని రిసీవ్ చేసుకుంటానన్నాడు" అన్నాడు.

నాకు తల తిరిగింది. "అదేమిటోయ్ అట్లాంటి పనిచేశావ్... ఇలాంటి వ్యవహారాలంటే అతను చాలా బాధపడిపోతాడు. కుర్రాళ్ళం మనం వెళ్లడంవల్ల ఇబ్బందేమీ లేదు. అతనికెలాగో నచ్చజెప్పొచ్చుగాని, తహసీల్దారును వెంట బెట్టుకొని వెళ్తే అతని బాధ చూడలేమోయ్... నాకు మొన్న ఏమని ఉత్తరం వ్రాశాడో తెలుసా... అక్కడి ఆఫీసులోని పెద్ద ఉద్యోగులు, గుమస్తాలు బంట్రోతుల ప్రవర్తనలను భరించలేక పోతున్నానని వ్రాశాడు. తన క్రింది ఉద్యోగస్తులు తన ముందు కూర్చోమన్నా కూర్చోలేదట. వాళ్ళ

తలలన్నీ పండిపోయి ఉన్నాయట. అయినా వాళ్ళు 'ఫరవాలేదు లెండి' అంటూ ఉంటారట. ఇక గుమస్తాలని ఎలా చూడాలో అక్కడి వాతావరణమే నిర్ణయించేస్తుందట. వాళ్ళు చేతులు కట్టుకొని అల్లంత దూరాన అంటరానితనం ఉన్నట్లు నిలబడుతూండటాన్ని చూడలేక పోతున్నానని వ్రాశాడు. పని అయిపోయినవెంటనే ఆ గుమస్తాలు, వెనక్కి అడుగులు వేసుకొని గుమ్మం వరకూ వెళ్ళి ఆ తరువాత మామూలుగా తిరిగి వెళ్ళిపోతూ చూపే విధేయతకు నా గుండె ఏడుస్తోంది అన్నాడు. ఇక బంట్రోతులు సరేసరి, ఎంత నీచమైన పని చెప్పినా చెయ్యడానికి మేం సిద్ధం అన్నట్లు ఉంటారట. ఇక మాట మాటకు 'అయ్యా, అయ్యా' అనడాలు,'చిత్తం, చిత్తం' అనడాలు, ముఖంలో ఏదో భయాన్ని, తక్కువ తనాన్ని నిరూపించే భావాల్ని స్పష్టం చేస్తూ ఆత్మాభిమానం శిరస్సును ఎలా వంచేసుకుంటూ ఉంటారో ఏ విధంగా చెప్పను అని ఎంతో వ్రాశాడు. ఈ స్థితిని ఎలా భరించాలో, ఈ బానిస భావాలను వారి నుండి ఎలా తొలగించాలో నాకేమీ తోచడంలేదు. కొన్నాళ్ళకు వీళ్ల విధేయతల లంచాలకలవాటు పడిపోయి నన్ను నేను మరచిపోతానేమో అని భయంగా ఉంది అని వ్రాశాడు. ఇప్పుడు నువ్వేమో దీనికి తగ్గట్టుగా మీ తహసీల్దారును పంపి, అతని బాధను రెట్టింపు చేయబోతున్నావు. అసలు నువ్వెందుకిలా చేశావ్..." అన్నా.

వెంటనే మా రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, "క్షమించు బ్రదర్... ఏమిటో మా తహసీల్దారు ప్రాపకం సంపాదించడానికి, నేను అతని గురించి చెప్పేశానోయ్. ఆయన నాకు తెలుసు అన్నా. దీనితో ఆయనా బయలుదేరుతానన్నాడు. ఇలా జరుగుతుందని నేననుకోలేదు" అన్నాడు.

ఈ వ్యవహారం నాకిష్టం లేదు. "అయితే ఇక నేను నీతో రాను" అనేశాను అతనితో. "నువ్వు మీ తహసీల్దారుతో వెళ్ళు. నేను స్టేషనుకు వచ్చేటప్పటికి మీరు కనిపించారని అతనితో చెప్పి నీకు మొన్ననెప్పుడో ఈ విషయం చెప్పడం వల్ల ఈ తప్పు జరిగిందని క్షమాపణ వేడుకుంటాను." అని అతనితో చెప్పేసి నేను స్టేషనుకు వెళ్ళిపోయాను.

అనుకున్నంత పనీ అయింది. అతను స్టేషనులో నిజంగా ఎంత బాధ పడిపోయాడో చెప్పలేను. నేనెన్ని చెప్పినా అతనునమ్మలేదు. "నాకుతలతెగిపోయినట్లుందండీ..." అన్నాడు. వెంటనే తహసీల్దారు, "మీరలాంటివేమీపెట్టుకోకండి" అన్నాడు. కాని అతను అలా సరిపెట్టుకునే మనిషి కాదు.

డ్రైవరు, పోర్టరు సహాయంతో మోహనరావుకు చెందిన సామానులు జీపులో

వేయించాడు. మేం నలుగురం ఇంటికి బయలేదేరాం.

ఇంటికి బయలుదేరాం అన్న మాటేగాని నా మనసు మనసులో లేదు. మోహనరావు, తహసీల్దారు, మా స్నేహితుడు వెనుక భాగంలో కూర్చున్నారు. జీపు వేగంగా పోతోంది. తహసీల్దారు, మోహనరావును అతి వినయంగా ఏమేమిటో ప్రశ్నిస్తున్నాడు. నా స్నేహితుడు మూగవాడిలా కూర్చున్నాడు. మోహనరావు సమాధానాలిస్తున్నాడు కాని అంత హుషారుగాలేడు. నాకెందుకనో అతని ముఖంలోకి చూడాలనిపించింది. కాని చూడలేకపోయాను. తహసీల్దారు ఇప్పటికెన్నిసార్లు 'సార్' అనే పుష్పాలు మోహనరావుమీద వెదజల్లాడో లెక్కపెట్టనూ లేకపోయాను. కాని ఈ తహసీల్దారు గారికి ఎంత పని పాడైందో అని, ఈ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తనకోసం అనవసరంగా శ్రమపడ్డాడని, ఇక నాకు కాలేజీకి వెళ్ళేందుకు వేళమించి పోతోందేమోనని, మోహనరావు బాధ పడుతూ ఉంటాడని మాత్రం ఆలోచించగలిగాను. నిజంగా అంతే జరిగింది. అతను తహసీల్దారుతో ఇవే విషయాలు చెపుతూంటే, నేను వినలేకపోయాను. అబ్బ! ఎంత సున్నితమైన హృదయం!

కారు ఇంటి ముందుకు వస్తోంది. అప్పుడే నా గుండెలెందుకో వేగంగా కొట్టుకున్నాయి. ఇంటి దగ్గరవున్న అతని తల్లి గురించి తలపుకు రాగానే నాకు పై ప్రాణం పైనేపోయింది. ఆ సంస్కారంలేని స్త్రీ, నా మనసులో మెదలడం మొదలు పెట్టింది.

కారు ఆడగం, మేం దిగడం, ఆ గుమ్మం దగ్గరకు వెళ్ళడం ఓ క్షణంలో జరిగిపోయాయి. కొద్దిగా చేరవేసి ఉన్న తలుపును తోసుకొని లోపలికి మోహనరావు ప్రవేశిస్తూ ఉండగా మాకీ మాటలు వినిపించాయి. "ఆమూల ఇంకా బూజు ఉంది. శుభ్రంగా దులుపు" అని.

ఈ మాటలు ఎవరు, ఎవరిని అన్నారో చెప్పనక్కరలేదనుకుంటాను. ఇంతలోనే తలుపు తెరుచుకోవడంతో ఆమె మాటలాగి పోయాయి. ఆమె ఖరీదైన బెంగుళూరు సిల్కు చీరె కట్టింది. దానికి తగ్గ జాకెట్టు తొడిగింది. పచ్చని ముఖానికి ఇంత కుంకుమబొట్టు, కళ్ళకు కాటుక పెట్టుకొని మెడలో కూతురు నగలు ఇన్ని వేసుకొని మమ్మల్ని చూడగానే చిన్న జమీందారిణిలా ధీమాగా నిల్చింది. కాని నేను ఆమెను చూడలేకపోయాను.

ఆ మూల చింకి గుడ్డలతో నిలిచి ఉన్న ఓ ప్రతిభావంతుని ముసలి తండ్రిని, బానిసలా నిలిచి ఉన్న వాణ్ణి చూశాను. అప్పుడే రాత్రి చూసిన నగ్నదృశ్యం నా కళ్ళకు

కట్టింది. మరుగులేని ఆమె గుర్తుకొచ్చింది. అప్పుడు ఆ సమయంలో ఆ యిల్లాలి మీద బ్యాటరీలైటు కాంతి పడితే ఆమె ఎలా సిగ్గుతో, అభిమానంతో, ఏమీ చేయలేని అశక్తితో శరీరాన్ని కుంచించుకుని, కుదించుకొని పాపం భూమిలోకి చొచ్చుకుపోతుందో అలా కనిపించాడా ముసలి తండ్రి. ఆ దృశ్యం చూడలేకపోయాను. నేను మా పోర్షనులోకి వెళ్లిపోవడానికి అరుగుమీదికి వచ్చేశాను.

అప్పుడే తహసీల్దారు, "ఏయ్ నువ్వెళ్ళి ఆ కారులోని సామాను తీసుకురా..." అన్నాడు.

నా కాళ్ళలో భూకంపం పుట్టింది. పాపం తహసీల్దారు మోహనరావు తండ్రిని ఆ యింటి నౌకరనుకొని ఉంటాడు!

మోహనరావు మనసు ఇక అప్పుడెలా ఉండి ఉంటుందో... ఏమి ఊహించగలను? కాని, అతను. ఆ నవయువకుడు, ఆ సంస్కారి, భవిష్యత్తుకు ప్రాణం పోసే ఆ వినయశీలి, "తహసీల్దారుగారూ... వారు మా నాన్న గారండి. నేనే సామాను తెచ్చుకుంటానండి" అన్నాడు.

(తెలుగు స్వతంత్ర 12-10-1956)